క్లుప్తంగా

మినీ వాటర్ ట్యాంకుల ప్రారంభం



మినీ వాటర్ ట్యాంకులను ప్రారంభించిన ఉప సర్పంచ్ నర్సింహమూర్తి, వీధివాసులు

రోలుగుంట: స్థానిక యాతవీధి, దేవాంగుల వీధి కూడళ్లలో తాగునీటి బోరు కనెక్షన్‌తో రెండు మినీ వాటర్ ట్యాంకులను పంచాయతీ నిధులతో ఏర్పాటు చేశారు. వీటిని ఉప సర్పంచ్ సుర్ల నర్సింహమూర్తి గురువారం కలసి ప్రారంభించారు. నీటి సమస్య తీరడంతో వీధి వాసులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, అల్లు నూకరాజు, ఒనుం బుజ్జి, శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ముషిడిపల్లి విద్యార్థినులు



విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దేవరాపల్లి: ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్‌లో విద్యార్థినులు కౌసల్య, తేజస్విని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వీరిని గురువారం స్థానిక పాఠశాలలో సర్పంచ్ మతల దేముడమ్మ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అప్పలరామ్ ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా సినీ దర్శకుడు పూరి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ జన్మదిన వేడుకలను ఆయన చదువుకున్న స్థానిక ఆర్సీఎం హైస్కూల్‌లో నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం కమిటీ సభ్యులు గంటా లలిత, కణితి అన్నపూర్ణ పాల్గొన్నారు. పూరి జన్మదిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు, పార్టీ నాయకుడు బేతిరెడ్డి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలతో నిరాధార వృద్ధులకు మేలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సహదేవుడు

రోలుగుంట: వృద్ధాశ్రమాలు నిరాధార వృద్ధులకు ఎంతో మేలు చేస్తాయని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సహదేవుడు తెలిపారు. కొవ్వూరు వృద్ధాశ్రమంలో 35 మంది వృద్ధులకు నర్సీపట్నానికి చెందిన రుత్తల వరహాలమ్మ తన భర్త దివంగత చిన అయ్యన్నపాత్రుడు జ్ఞాపకార్థంగా గురువారం పండ్లు పంచిపెట్టారు. భోజనాలు ఏర్పాటు చేశారు. ఎంతో వ్యయప్రయాసలతో ఆశ్రమం నడుపుతున్న నిర్వాహకుడు యర్రంశెట్టి రాజారావును ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అభినందించారు. దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

నాతవరం: వచ్చే నెల 3వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. గత సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలపై ఎంత వరకు పరిష్కరించారనేది శాఖల వారీగా అధికారులు వివరించాల్సి ఉంటుందని, పూర్తి సమాచారంతో రావాలన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854,
7997958336

హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం

- గొడగల వీధిలో ఇళ్ల నిర్మాణానికి రూ.4.50 లక్షల సాయం
- 17 మందికి రూ.25 వేల చొప్పున పంపిణీ
- ఒకరికి స్థానిక నాయకుల చేయూత



లబ్ధిదారులకు చీరలు, నగదు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నిలబెట్టుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో జగ్గన్న సావిడి గొడగలవీధిలో 18 నిరుపేద కుటుంబాలకు రూ.25 వేల చొప్పున మొత్తం రూ.4.50 లక్షలు పంపిణీ చేశారు. వీరంతా పాడు పడిన కొంపలో నివాసముంటున్నారు. వీరి పరిస్థితి గమనించి ఇళ్లు మంజూరు చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. తాము నిర్మించుకోలేమని వాపోయారు. దాంతో ప్రభుత్వ నిధులతో ఇల్లు నిర్మించుకున్న వారికి తాను రూ.25 వేల చొప్పున సాయం అందజేస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాపల్లి శ్రీనివాసరావు, పెరుమళ్ల వెంకటరావుల సహాయంతో పాత ఇళ్లు తొలగించి పక్కా ఇల్లు మంజూరు చేశారు. దీంతో అతికష్టం మీద ప్రస్తుతం శ్లాబు దశ వరకు నిర్మించుకున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక గొడగల కాలనీకి వచ్చి 17 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క చీరతోపాటు రూ.25 వేలు పంపిణీ చేశారు. ఇంకొక లబ్ధిదారుకు ఎంపీపీ రామధర్మజ, జెడ్పీటీసీ రమణమ్మ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనువాసరావు, ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, తదితరులు రూ. 25 వేలు అందజేశారు. కాబోయే ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు తాగునీటి కోసం తన సొంత నిధులతో మోటారు అందజేశారు. గృహ ప్రవేశాలు చేసుకున్న వారికి గృహోపకరణాలను సీఎస్ఆర్ నిధులతో అందజేస్తానని అనకాపల్లి ఎంపీ సత్యవతి హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం బూడి తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు ఎం.అశోక్, జాంటీ, పొలిమేర చిన్నారావు పాల్గొన్నారు.

మనసున్న నాయకుడు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మనసున్న నాయకుడు. ఆయన పది నెలల క్రితం గడపగడపకు వచ్చి ఇల్లు మంజూరుతోపాటు నిర్మించుకున్న వారికి రూ.25 వేల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం ఇవ్వడంతో మాలాంటి అభాగ్యులకు ఆనందంగా ఉంది.

– జలుమూరి పాపయ్యమ్మ, గొడగల కాలనీ

సొంతింటి కల నెరవేరబోతుంది



శిథిల ఇళ్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి మంజూరు చేశారు. ప్రభుత్వ నిధులతోపాటు డిప్యూటీ సీఎం అందించిన సాయంతో తాకు సొంతింటి కల నెరవేరబోతుంది. ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది.

– బొట్టా సీతమ్మ, గొడగల కాలనీ, మాడుగుల

రేబిస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ



రావికమతం: ర్యాలీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది



కె.కోటపాడు: రేబిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డి.ఎస్.ఎన్.రాజు

రావికమతం: ముందు జాగ్రత్త తీసుకోకపోతే రేబిస్ వ్యాధి ప్రాణాంతకమని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రావికమతం, కొత్తకోట వైద్యాధికార్లు, సిబ్బంది తెలిపారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుక్క కరిచిన వెంటనే తగిన చికిత్స తీసుకుంటే ప్రాణాంతకమైన రేబిస్ దరి చేరదన్నారు. అశ్రద్ధ చూపితే వ్యాధి మెదడుకు సోకి మృతి చెందుతారన్నారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికార్లు దుర్గాప్రసాద్, రజని, కొత్తకోట ఉప సర్పంచ్ పందల దేవా పాల్గొన్నారు.

కె.కోటపాడు: రేబిస్ వ్యాధి సోకే పరిస్థితిపై ప్రజలు అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా గురువారం గొండుపాలెంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ కుక్కకాటుకు గురయ్యే సమయంలో రేబిస్ బారిన పడకుండా తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. పెంపుడు శునకాలకు ముందస్తుగా టీకాలు వేయించాలని వివరించారు.

భగత్‌సింగ్ ఆదర్శంగా యువత పనిచేయాలి



మాట్లాడుతున్న రవిశంకర్



హాజరైన విద్యార్థులు

చోడవరం రూరల్: అసమానతలు, పేదరికం, నిరుద్యోగం లేని నవసమాజ నిర్మాణానికి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని జన సాహితీ జిల్లా నాయకుడు ఎ.రవిశంకర్ కోరారు. గురువారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో భగత్‌సింగ్ 117వ జయంతిని నవ యువ సమాఖ్య నిర్వహించింది. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమాఖ్య జిల్లా నాయకుడు ఎన్.భాస్కరరావు అధ్యక్షతన ఉపాధి అవకాశాలు–యువత ఎదుర్కొంటున్న సవాళ్లు అంశంపై సదస్సు నిర్వహించారు. భగత్‌సింగ్ జీవితంలో ఎదురైన స్ఫూర్తివంతమైన విశేషాలను రవిశంకర్ వివరించారు. సమాజంలో దోపిడీ, అన్యాయాలు, సామాజిక సమస్యల పట్ల యువత ఎలుగెత్తాలన్నారు. మరో వక్త ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్ మాట్లాడుతూ నిలకడైన, భద్రతతో కూడిన ఉపాధి అవకాశాల కోసం యువత పోరాడాలన్నారు. పీడీఎస్‌వో జిల్లా నాయకుడు సియ్యాద్రి రుద్రి మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించిన విధానాలే నేటికీ మన దేశంలో అమలవుతుండటం శోచనీయమన్నారు. పీడీఎస్‌వో, ఎన్‌వైఎస్ నాయకులు ఎ.మౌనిక, బి.రాజేష్, కె.నాగేష్, పి.రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు



దేవరాపల్లి: కుమ్మరివీధిలో డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ



ఎం. కోడూరులో వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు



మాడుగుల: అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక కుమ్మరివీధిలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ పాల్గొని వడ్డన చేసి ప్రారంభించారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావుతో కలిసి స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వాలేటి నాగరాజు, ఎడ్ల బంగారయ్య, మిడతాడ శ్రీను, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కె.కోటపాడు: వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సూదివలసలో వినాయక విగ్రహ అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి వేడుకలు ముగింపు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. వినాయక లడ్డూను వేలంలో గ్రామానికి చెందిన తగినేని కార్తీక్ రూ.3 వేలకు దక్కించుకున్నాడు. ఎంపీటీసీ వర్రి రామునాయుడు అతడికి లడ్డూను అందించారు.

మాడుగుల రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం రాత్రి వినాయ విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. ఎం. కోడూరులో లక్ష్మీనారాయణ, సంపత్ వినాయక ఆలయాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలో తాచేరు నదిలో నిమజ్జనం చేశారు. కె.జె.పురంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సాంస్కృతిక కార్యక్రమాల నడుమ నిమజ్జనం చేశారు. గురువారం వినాయక మండపాల వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

నేడు అన్నసమారాధన

మదర్ థెరిసా యూత్ ఆధ్వర్యంలో కె.జె.పురంలో వినాయక మండపం వద్ద శుక్రవారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు గురువారం తెలిపారు.

మాడుగుల: స్మైల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పట్టణంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా గురువారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభకు తరలిరండి

మాడుగుల రూరల్: గోవాడలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే సుగర్ మహాజన సభను విజయవంతం చేయాలని కె.జె.పురం చెరకు కాటా కేన్ ఇన్‌స్పెక్టరు సాగర్ గురువారం తెలిపారు. ఈ మేరకు సభ ఎజెండాలను గ్రామాల్లో సభ్య రైతులకు అందజేశామన్నారు. ఫ్యాక్టరీ పాసుపుస్తకంతో హాజరు కావాలనని కోరారు.

ఉరుములు, పిడుగులతో భారీ వర్షం



వడ్డాది- రావికమతం రహదారిలో కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట: మండలంలో భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండ కాసింది. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, పొట్టిదొరపాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో పిడుగులు పడ్డాయి. వీటి శబ్దానికి పొలాల్లో రైతులు, పశువుల కాపరులు, కూలీలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పొలాల్లో వర్షం నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో ఉపశమనం

మాకవరపాలెం: భారీ వర్షంతో ప్రజలకు ఉపశమనం కలిగింది. మండలంలో నాలుగు రోజులుగా భానుడు భగభగలతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికంగా కాసిన ఎండతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అనంతరం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని గంటకుపైగా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడి ప్రజలకు ఉపశమనం లభించగా పంటలకు వర్షం మేలు చేసింది.

శాకంబరి అలంకరణలో మరిడిమాంబ



అనకాపల్లిటౌన్: గవరపాలెం మరిడిమాంబ దేవాలయంలో నెల పండగ పురస్కరించుకుని శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బుద్ధ కృష్ణారావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ వైస్ చైర్మన్ కె.ఎం.నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు, సభ్యులు బొడ్డేడ లక్ష్మీనరసింహం, కర్రి సూరిబాబు, పీలా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు బుచ్చింపేట విద్యార్థి



విద్యార్థి దుర్గాప్రసాద్‌తో హెచ్‌ఎం శేఖర్, పీడీ కొండలరావు

రోలుగుంట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మాకవరపాలెంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచాడు. అండర్ –17 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అతడిని హెచ్‌ఎం శేఖర్, పీడీ కొండలరావు గురువారం అభినందించారు.

రేపు తామరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మాకవరపాలెం: తామరంలో ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. ఈ మేరు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే సర్వే ద్వారా గుర్తించిన వారంతా శనివారం జరిగే ఆరోగ్య శిబిరానికి హాజరు కావాలన్నారు. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

మాడుగుల రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. ఈ నెల 30వ తేదీ నుంచి మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు కలిసి సర్వే చేపట్టారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో తొలివిడతగా మాడుగుల–2, ఎం. కోడూరు, తాటిపర్తి, వీరనారాయణం ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోనూ, కింతలి పీహెచ్‌సీ పరిధి గ్రామాలతోపాటు వడ్డాది పీహెచ్‌సీకి సంబంధించి నాలుగు ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోనూ బీపీ, సుగర్, వంటి వ్యాధిగ్రస్తులను పరీక్షించి వివరాలు నమోదు చేసుకున్నారు.

రూ.12.50 లక్షలతో తారకరామకు నూతన గేట్లు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: నియోజకవర్గంలో ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి సాగుకు మళ్లించి రైతులను ఆదుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నానని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక జగ్గన్న సావిడి వద్ద తారకరామ ఆయకట్టు రైతులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఇప్పటికే పెద్దేరు ఆధునికీకరణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.84.40 కోట్లు మంజూరు చేశారన్నారు. తాజాగా తారకరామ జలాశయం గేట్లు శిథిలమవ్వడంతో కొత్తవి నిర్మాణానికి రూ.12.50 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. పంట కాలువ బాగు చేయించి శివారు ఆయకట్టు వరకు సాగు నీరు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పనులు త్వరితగతిని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓఎస్‌డీ ఎం. పోలినాయుడు, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లవిల్లి రాజేష్, పడాల అప్పలనాయుడు, కాళింగ కళ్యాణరాజు, పొలిమేర చిన్నారావు, ఇందుకూరి నాగరాజు, సయ్యపురెడ్డి సత్తిబాబు, జవ్వాది వరహాలు, ఎడ్ల హేమంత్‌కుమార్, కొట్యాడ భాస్కర్, తారకరామ ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ఎం.కోడూరు గ్రామానికి చెందిన వెంకటనారాయణమూర్తికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష చెక్కు గురువారం అందజేశారు. చింతా వెంకటనారాయణమూర్తి తండ్రి సోమకేశవరావు అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా, ఈ మొత్తం మంజూరైంది.

జగనన్నకు చెబుదాం అర్జీలకు సత్వరమే పరిష్కారం



వీఆర్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: జగనన్నకు చెబుదాం అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు హెచ్చరించారు. ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమై మాట్లాడారు. రైతుల సమస్యల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. కార్యాలయానికి భూసమస్యలపై వచ్చే రైతుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. భూ రీసర్వే వేగవంతం చేయాలన్నారు. ఇంతవరకు రీసర్వే పూర్తి చేసిన రెవెన్యూ గ్రామాల్లో ఆన్‌లైన్ పాసుపుస్తకాలు సకాలంలో అందించాలన్నారు. రైతుల సందేహాలు నివృత్తి చేయాలని, వారి నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణ కాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్వోలదేన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, మండల సర్వేయరు బాలరెడ్డి, ఆర్ఐ హరి, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ పాల్గొన్నారు.

ఊర చెరువు సుందరీకరణకు సహకరిస్తా

రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ జోగినాయుడు



పంచాయతీ కార్యదర్శితో చర్చిస్తున్న జోగినాయుడు

నాతవరం: స్వగ్రామంలో చెరువు సుందరీకరణకు అవసరమైన సహకారం అందిస్తానని రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక క్రియేటివ్ హెడ్ ఎల్. జోగినాయుడు అన్నారు. చెర్లోపాలెం గ్రామాన్ని ఆనుకున్న ఊర చెరువు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే సర్పంచ్ పైల శిరీషా ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో కొంత మేర అభివృద్ధి చేశారు. ఈ మేరకు గురువారం జోగినాయుడు ఇక్కడ చెరువును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పార్కు మాదిరిగా ఆహ్లాదకరంగా తయారు చేస్తామన్నారు. దీనిపై ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌తో చర్చిస్తామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంపై జాషువా రచనల ప్రభావం



మాట్లాడుతున్న రాజశేఖర్

చోడవరం రూరల్: అభ్యుదయ కవిగా, రచయితగా నేటికీ సమాజంలో గుర్రం జాషువా ప్రభావం తిరుగులేనిదని విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రాత రాజశేఖర్ తెలిపారు. గురువారం సిటిజన్ కాలనీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ప్రసన్న భారతి, అంబేడ్కర్ షెడ్యూల్డ్ కులాల సేవా సంఘం ఆధ్వర్యంలో నవయుగ కవి గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. జాషువా చిత్రపటాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్.దేముడు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో రాజశేఖర్ మాట్లాడుతూ జాషువా రచనలైన ఫిరదౌసి, గబ్బిలం, శ్మశానవాటికలలో అద్భుతమైన పద్యాలను, రచనల్లోని తాత్పర్యాలను వివరిస్తూ ఆహూతులను అలరించారు. వక్త రాజశేఖర్, వేదిక వార్డెన్ ఈశ్వరరావులను బైరా సంస్థ నిర్వాహకులు సత్కరించారు. ఆర్క్ డి.ఎస్.ప్రసాద్, వరప్రసాద్, విశ్రాంత ఆర్జేడీ తిరుపతిరావు, టి.వి.రమణ, ఎం.వి.స్వామి, నూకాచారి ప్రసంగించారు.

అనుపు ఉత్సవంలో అశ్లీల నృత్యాలు

పలువురిపై కేసు నమోదు



సీఐ శ్రీనివాసరావు

చోడవరం రూరల్: వినాయక అనుపు ఉత్సవంలో అశ్లీల నృత్యాలు ప్రదర్శించిన వారిపై కేసు నమోదు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి వినాయకుని నిమజ్జనోత్సవంలో భాగంగా దామునాపల్లిలో అశ్లీల నృత్యాలు చేయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ సూర్యనారాయణ తన సిబ్బందితో గ్రామానికి వెళ్లారన్నారు. అనకాపల్లికి చెందిన ఇద్దరు అమ్మాయిలు పరారయ్యారని, దీనికి బాధ్యులైన కామరాజు గోవింద్, రెడ్డి నాగేశ్వరరావులతోపాటు ఉత్సవ నిర్వాహకులు, కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశామన్నారు. ఇలాంటి సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడినట్టయితే కేసులను ఎదుర్కోక తప్పదన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com